సాక్షి
ఖమ్మం

గురువారం । 19 । జూన్ । 2025



డయేరియా నిర్మూలనే లక్ష్యం

డయేరియా నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ మాత్రల పంపిణీకి శ్రీకారం చుట్టారు. 8లో



బిందు సేద్యానికి ప్రోత్సాహం

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేలా సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు మంజూరు చేయనున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 27°

జిల్లాలో గురువారం ఉదయం, సాయంత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం మాత్రం వేడి, వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. కూసుమంచి మండలం నర్సింహులగూడెం, పురియాతండా, చింతలతండా గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి గురువారం సాయంత్రం శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత పోచారం, కూసుమంచిలోనూ సీసీ, బీటీ రోడ్లనిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

23న ఒలింపిక్ డే రన్



సమీక్షలో మాట్లాడుతున్న డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడల శాఖ, ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 23న ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్య మాట్లాడారు. పాఠశాలల విద్యార్థులు, క్రీడా సంఘాల బాధ్యులు, యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ పాఠశాల నుంచి 150మంది విద్యార్థులను పంపించేలా డీఈఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, క్రీడాసంఘాల ప్రతినిధులు గోవింద్‌రెడ్డి, ఎస్.ఉప్పల్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, ఉదయ్‌కుమార్, ఎం.డి.గౌస్ పాల్గొన్నారు.

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: సివిల్స్(ప్రిలిమ్స్, మెయిన్స్)కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, పీడబ్ల్యూడీ నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వనుండగా, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించని వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చేనెల 13న నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తు విధానం, ఇతర సమాచారం కోసం కోసం టీజీఎస్సీ స్టడీ సర్కిల్‌లో లేదా 90320 77276 నంబర్‌లో సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.

780 షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీ

ఏన్కూరు: జిల్లాలోని 780 రేషన్ షాప్‌ల ద్వారా కార్డుదారులకు మూడు నెలల సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నామని డీసీఎస్ఓ చందన్‌కుమార్ తెలిపారు. ఏన్కూరులోని పలు రేషన్ దుకాణాలను బుధవారం తనిఖీ చేసిన ఆయన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం డీసీఎస్ఓ మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈనెల 30వ తేదీ వరకు బియ్యం పంపిణీ జరుగుతుందని, కార్డుదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని సూచించారు. తనిఖీల్లో ఆర్ఐలు పవన్‌కుమార్, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

రూ.10 ప్యాకెట్లలో విజయ పాలు, పెరుగు



విజయ పాల ప్యాకెట్

ఖమ్మంవ్యవసాయం: అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విజయ ద్వారా పాలు, పెరుగు ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.10కి 150 మి.లీ. పాలు, 120 గ్రాముల పెరుగు ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ప్రైవేట్ సంస్థల పోటీని తట్టుకోవడమే పాటు ప్రజలకు అనుకూలంగా ఉండేలా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వీటిని విక్రయిస్తున్నట్లు ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ కె.రవికుమార్ తెలిపారు.

27,360 మందికి రైతుభరోసా

ఖమ్మంవ్యవసాయం: రైతుభరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతోంది. మూడో రోజైన బుధవారం జిల్లాలో నాలుగెకరాల వరకు భూమి కలిగిన 27,360 మంది రైతుల ఖాతాల్లో రూ.57,22,91,899 జమ చేశారు. మొత్తం 3,53,794 మందిని అర్హులుగా గుర్తించగా, ఇప్పటివరకు 2,88,151మంది రైతులకు రూ.250,67,89,542 అందాయని డీఏఓ ధనసరి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకులాల్లో లోటుపాట్లు ఉండొద్దు..

ఉన్నతాధికారులు తరచూ తనిఖీ చేయాలి

- అవసరమైన అన్ని ప్రాంతాలకూ బస్సు సర్వీసులు
- ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గురుకులాల నిర్వహణ కొనసాగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా, ఎక్సైజ్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి.పాటిల్, సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుకులాలు, వసతిగృహాల నిర్వహణ, బీసీ సంక్షేమం, రవాణా, ఎక్సైజ్ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, వనమహోత్సవం నిర్వహణపై సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ సరైన వసతులు లేని గురుకులాలను ప్రత్యామ్నాయ భవనాల్లోకి మార్చాలని, ఎక్కడా దోమల బెడద లేకుండా జాలీలు ఏర్పాటుచేయాలని సూచించారు. కామన్ డైట్ కచ్చితంగా అమలయ్యేలా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేయాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు గతంలో రూ.వేల కోట్లు ఖర్చు చేసినా, ఎన్ని బతికాయో లెక్కలు చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. ఈసారి అలాకాకుండా మొక్కల పెంపకాన్ని బాధ్యతగా భావించాలని సూచించారు. కాగా, బస్సు సర్వీసులు అవసరమైన గ్రామీణ రూట్లపై ప్రతిపాదనలు సమర్పిస్తే నూతన బస్సులు కొనుగోలు చేస్తామని తెలిపారు.

ఐఐటీ, నీట్ పై శిక్షణ అందించాలి..

గురుకులాల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరుస్తూ, ఐఐటీ, నీట్‌ల్లో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పెరిగిన డైట్ చార్జీల ఆధారంగా కామన్ డైట్ అమలుచేయాలని తెలిపారు. గ్రామీణ యువత ఉద్యోగాలు సాధించేలా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ ఏడాది వన మహోత్సవంలో ఈత, తాటి మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తూ గీత కార్మికులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పీఎం ఈ స్కీం ద్వారా ఎలక్ట్రికల్ బస్సులు తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళా సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పి.నీరజ, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు అనుదీప్, పాటిల్, తదితరులు

ఊరికో బస్సు... ఇంటికో దీపం

మధిర: ఊరికో బస్సు... ఇంటికో దీపం అనే నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిరలో రూ.10కోట్లతో నిర్మించే బస్‌స్టేషన్ పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి ఆయన ప్రారంభించాక మాట్లాడారు. 1978లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వాన ఊరికి ఒక బస్సు.. ఇంటికో దీపం నినాదంతో ప్రభుత్వం ఏర్పాటు కాగా.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఆ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. గత పాలకుల హయాంలో ఆర్టీసీ నష్టపోతే, ఇప్పుడు రవాణా శాఖ మంత్రి పొన్నం కృషితో లాభాల బాట పట్టిందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ రూ.6,210 కోట్లను సంస్థకు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. కాగా, మహిళా సంఘాల ద్వారా 600 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అప్పగించనున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ నూతన సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 1987లో ఆరు బస్సులతో ప్రారంభమైన మధిర బస్టాండ్ ఇప్పుడు అత్యాధునిక రూపు సంతరించుకోనుందని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన డిమాండ్ దృష్ట్యా మహిళా సంఘాల ద్వారా కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రారంభించి కొద్దిదూరం ప్రయాణించారు. మధిర మార్కెట్ చైర్మన్ నర్సింహారావు, ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పగిడిమర్రి సోలోమన్, ఆర్టీసీ అధికారులు చెరుకుపల్లి వెంకన్న, అజ్మీరా సరిరామ్, జోగు భాస్కర్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

విద్యుత్ సంస్థల్లో సాంకేతిక పరిజ్ఞానం



పరికరాల పనితీరును డిప్యూటీ సీఎంకు వివరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

బోనకల్: రైతు భరోసా ద్వారా తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేయనున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సాగు పనులు ఊపందుకోకముందే పెట్టుబడి సాయం అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. బోనకల్ మండలం సీతానగరం సబ్‌స్టేషన్‌లో రియల్ టైమ్ ఫీడర్ మేనేజ్‌మెంట్, ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్ సిస్టమ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. రియల్‌టైం ఫీడర్ మేనేజ్‌మెంట్ సిస్టం సబ్‌స్టేషన్లలో ఫీడర్ల పర్యవేక్షణ, నియంత్రణ, రక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. తొలుత రాష్ట్రంలోని 100సబ్‌స్టేషన్ల ఈ వ్యవస్థ ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. అలాగే, ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్ ద్వారా విద్యుత్ సరఫరాలో అవాంతరం ఎక్కడ ఉందో గుర్తించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనివాసాచారి, సీఈ తిరుమల్‌రావు, అధికారులు భద్రూపవర్, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, మనోహర్, సాయి, సుందర్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పైడిపల్లి కిశోర్‌కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుధీర్‌బాబు పాల్గొన్నారు.

1912కు ఫోన్ చేస్తే విద్యుత్ సమస్య పరిష్కారం

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా 2029–30 నాటికి న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా మరో 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించామని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యాన రూపొందించిన విద్యుత్ అంబులెన్స్‌లను ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే విద్యుత్ అంబులెన్స్ ద్వారా సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేస్తారని భట్టి తెలిపారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి ఎలక్ట్రికల్ సేఫ్టీ టూల్ కిట్లు అందజేయగా, ఉద్యోగుల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈశిబిరంలో డీఎంహెచ్ఓ కళావతిబాయి నేతృత్వాన వైద్యులు చందు నాయక్, సైదులు, బాలకృష్ణ, చందన తదితరులు 1,217 మందికి పరీక్షలు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్ఈలు ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఏ.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అంబులెన్స్‌లకు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం, సీఎండీ వరుణ్‌రెడ్డి

భూముల ధరలు సవరణ ?

- గత కమిటీల నిర్ణయాలనే ఖరారు చేసే అవకాశం
- బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా పెంపు
- జిల్లాలో పలుచోట్ల మార్పులకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. భూముల విలువ పెంపుపై గతేడాదే కసరత్తు చేసినా ప్రతిపాదనలకే పరిమితమైంది. అప్పట్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో జిల్లాలో భూముల విలువ పెంపుపై నివేదికలు సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ అధికంగా ఉన్నందున, అందులో సగం మేర పెంచినా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం పెరుగుతుందని భావించారు. ఈ అంశంపై తాజాగా ప్రభుత్వం మళ్లీ కసరత్తు మొదలుపెట్టడంతో జిల్లాలో ఎక్కడెక్కడ భూముల విలువ పెరుగుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది.

ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు

భూముల ధరల పెంపునకు సంబంధించిన ప్రక్రియను గతేడాది జూన్‌లో జిల్లా కమిటీలు, సబ్ రిజిస్ట్రార్లు పూర్తి చేయగా.. ఆ ప్రతిపాదనలను ఇటీవల ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలతో పాటు 11సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువల సవరణపై నివేదికలు అందించినట్లు సమాచారం. అయితే గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన సమయాన ఉన్న అధికారులు ఇప్పుడు లేకపోవడంతో ప్రస్తుత అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. భూముల విలువ పెంపు సక్రమంగా జరిగిందా, ఇంకా ఏమైనా సవరణలు అవసరమా అని పరిశీలిస్తుండగా.. పెద్దగా మార్పులేమీ ఉండకపోవచ్చని తెలిసింది.

భారీగా తేడాలు

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ సవరింపు జరగనున్నట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సమయాన అమలుచేస్తున్న ధరల్లో భారీగా తేడా ఉంటోంది. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా, భూవిలువల పెంపుపై గతేడాది కమిటీల నిర్ణయం ప్రకారమే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రెండు వారాల క్రితం జిల్లా రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమావేశంలో గత ప్రతిపాదనలనే ఖరారు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత ప్రతిపాదనలనే పరిగణనలోకి తీసుకుంటే ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ భారీగా పెరుగుతుందనే చర్చ జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో మెయిన్ రోడ్డు వెంట ఉన్న వ్యవసాయేతర భూముల విలువ ప్రస్తుత ధరకు నాలుగు నుండి ఐదు రెట్లు పెరిగే అవకాశముందని చెబుతున్నారు. మిగతా ప్రాంతాల్లోనూ బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ సమయాన నిర్ణయించే ధరలు 50శాతం మేర పెరిగే అవకాశముంది.

రూ.400 కోట్ల మేర ఆదాయం

ప్రభుత్వం వ్యవసాయ, వ్యవసాయేతర భూవిలువలను పెంచితే ఉమ్మడి జిల్లా నుండి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.400 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశముందని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉన్న ధరలతో ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రూ.264 కోట్ల వరకు ఆదాయం నమోదవుతోంది. భూవిలువ పెరిగితే ఈ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని.. అంచనాలకు మించి నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

మెడికల్ కాలేజీలో వసతులపై సంతృప్తి

వర్చువల్‌గా పరిశీలించిన ఎన్ఎంసీ బృందం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం ప్రవేశాల అనుమతికి మార్గం సుగమమైంది. 2025–26 ఏడాదికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు కోసం రాష్ట్రంలోని పలు కాలేజీలను ఇటీవల ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కౌన్సిల్) బృందం పరిశీలించింది. అయితే, పలు లోపాలు ఉన్నాయంటూ 26 కాలేజీలకు నోటీసులు జారీ చేసింది. ఈ జాబితాలో ఖమ్మం కాలేజీ కూడా ఉండగా, ఎలాంటి సమస్యలు లేవని చెబుతూ అధికారులు నివేదిక సమర్పించారు. ఈమేరకు రాష్ట్ర హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఢిల్లీలోని ఎన్ఎంసీ కార్యాలయంలో బుధవారం హాజరుకాగా, బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖమ్మం నుంచి ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొని మూడో ఏడాది విద్యార్థుల బోధనకు ఉన్న వసతులు, గతంలో నమోదైన ఫలితాలను వివరించారు. దీంతో ఎన్ఎంసీ బృందం సంతృప్తి వ్యక్తం చేయగా, మూడో ఏడాది ప్రవేశాలకు అనుమతి ఇవ్వడం లాంఛనమేనని ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు.

ఓసీలో రక్షణ చర్యలపై ఆరా

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓపెన్ కాస్ట్(ఓసీ)ను బుధవారం సింగరేణి సౌత్ సెంట్రల్‌జోన్ డిప్యూటీ డీజీఎంఎస్ టీఆర్.కన్నన్ పరిశీలించారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు, పీఓ ప్రహ్లాద్‌తో కలిసి ఓసీ కార్యాలయం, మైనింగ్ ప్లాన్, వ్యూ పాయింట్‌ను పరిశీలించిన ఆయన పలు వివరాలు ఆరా తీశారు. బొగ్గు వెలికితీత సమయాన గనులతో పాటు కార్మికుల రక్షణ చర్యలపై ఆరా తీశారు. అనంతరం అధికారులు వ్యూ పాయింట్ వద్ద మొక్కలు నాటారు. వివిధ విభాగాల అధికారులు అశోక్‌కుమార్, ఆనందవేల్, దిలీప్‌కుమార్, కమలేష్‌కుమార్ వర్మ, చింతల శ్రీనివాసరావు, తివారీ, సూర్యనారాయణరాజు, వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, గోవింద్, అభిలాష్, దేవదాస్ పాల్గొన్నారు.



ఓసీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వడలిపోతున్న ఆశలు

ఈసారి ముందుగా రుతుపవనాలు వచ్చేశాయని, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో రైతులు సంతోషించారు. ఇందులో భాగంగా రఘునాథపాలెం మండలంలో పలువురు రైతులు ఈసారి మిర్చి తగ్గించి పత్తి సాగుకు మొగ్గు చూపారు. త్వరగా పత్తి చేతికొస్తే ఆపై మొక్కజొన్న సాగు చేయొచ్చని నిర్ణయం తీసుకున్నారు. గతనెల మూడు, నాలుగో వారాల్లో అడపాదడపా వర్షాలు కురవడంతో పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటారు. కానీ ఆతర్వాత వరుణుడి జాడ లేకపోగా అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతవుతున్నా వర్షం మాత్రం కురవడం లేదు. దీంతో రూ.వేలు వెచ్చించి భూమి సిద్ధం చేయడంతో పాటు విత్తనాలు నాటిన రైతులు ఇప్పుడేం చేయాలో పాలుపోక ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల విత్తనాలు మొలకెత్తినా మండే ఎండలతో అవి వాడిపోతున్నాయి. దీంతో ప్రతిరోజు పొలానికి వెళ్లడం.. వర్షం ఎప్పుడు కురుస్తుందా అని చూడడం.. వడలిపోతున్న మొక్కలను చూసి ఆవేదనగా ఇంటిముఖం పడుతున్న రైతులు పలుచోట్ల కనిపిస్తున్నారు. ఒకవేళ మరో రెండు, మూడు రోజుల్లో వర్షం కురవకపోతే మళ్లీ విత్తనాలు నాటాల్సిందేనని.. తద్వారా రూ.వేలల్లో నష్టం ఎదురవుతుందని ఆవేదన చెందుతున్నారు. – రఘునాథపాలెం



పత్తి విత్తనం మొలకెత్తిందా అని చూస్తున్న రైతు (ఇన్‌సెట్) వడలిపోయిన పత్తి మొక్క

సహకార శిక్షణ ఇక ఇక్కడే..

- నాలుగు జిల్లాలకు కలిపి ఖమ్మంలో..
- చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సహకార శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసింది. సహకార వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణా కేంద్రాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యాన మల్టీ జోన్–1గా హైదరాబాద్, మల్టీ జోన్–2గా వరంగల్‌లో మాత్రమే కేంద్రాలు కొనసాగుతున్నాయి. కానీ రాష్ట్రంలోని 60 వేల సహకార సంఘాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని భావించిన ప్రభుత్వం .. కొత్తగా మరో మూడు కేంద్రాలను మంజూరు చేసింది. వీటిని ఖమ్మంతో పాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుచేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చట్టాలపై అవగాహన..

సహకార వ్యవస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, అనుబంధ సంస్థలు, ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లకు సహకార చట్టం, సహకార వ్యవస్థ నిర్వహణపై అవగాహన పెంచేలా ఈ కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), గొర్రెల పెంపకందారులు, మత్స్య సహకార సంఘాలు, కార్మిక సహకార సంఘాల నిర్వాహకులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, స్టాఫ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ స్టాఫ్, డైరెక్టర్లకు ఈ కేంద్రం ద్వారా చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే, కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉద్యోగులు, ప్రతినిధులకు కూడా ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. సహకార చట్టాలతో పాటు వ్యవస్థ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఆడిట్, వ్యాపార లావాదేవీలే కాక నూతనంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నాలుగు జిల్లాలకు కలిపి..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో సహకార ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేలా ఖమ్మంలో కేంద్రాన్ని నెలకొల్పుతారు. ఖమ్మం జిల్లాలోని 76 పీఏసీఎస్‌లు, ఏడు జిల్లా స్థాయి సొసైటీలు, 818 ఎయిడెడ్, 434 అన్ ఎయిడెడ్ సొసైటీలతో పాటు భద్రాద్రి జిల్లాలోని 21 పీఏసీఎస్‌లు, ఒక జిల్లా స్థాయి సొసైటీ, 316 ఎయిడెడ్, 315 అన్ ఎయిడెడ్ సొసైటీలే కాక మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని సంస్థల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కేంద్రం అందుబాటులోకి రానుంది. కాగా, ఈ కేంద్రం నిర్వహణకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సంబంధిత అంశాల్లో అనుభవం కలిగిన ఫ్యాకల్టీని నియమించడమే కాక అవసరమైన భవనాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

టీ క్యాంటీన్లలో తనిఖీ



టీపొడర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో టీ క్యాంటీన్లను ఆహార తనిఖీ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన బృందం రైల్వేస్టేషన్ రోడ్డు, కస్బాబజార్ ప్రాంతాల్లో టీ స్టాళ్లలోని టీపొడర్, పాలు, ఇతర పదార్థాలను పరిశీలించారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని కిరణ్‌కుమార్ హెచ్చరించారు. ఆహార తనిఖీ అధికారులు లోకేశ్, శరత్, ల్యాబ్ టెక్నీషియన్ రతన్‌రావు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా



ఖమ్మంసహకారనగర్: ఖమ్మం బస్ డిపో రోడ్డులోని న్యూ చైతన్య అకాడమీ వద్ద హెచ్‌సీఎల్ టెక్ ఆధ్వర్యాన ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు. 2023–24, 2024–25లో ఇంటర్ బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూప్‌ల లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఐటీ, డీపీఓలుగా నియామకానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 83414 05102 నంబర్‌లో సంప్రదించడంతో పాటుhttp::/bit. ly HCLTB& Telangana లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఐఈఓ తెలిపారు.

గెలిచిన వారిపై ఓడిపోయిన వారి దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్ ఎన్నికలు ఇటీవల జరగగా.. ఓడిన వారు ఆగ్రహంతో గెలిచిన వర్గీయులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఓ అంబులెన్స్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతున్నాడు. పలు ప్రైవేట్ ఆస్పత్రులకు సంబంధించిన అంబులెన్స్ డ్రైవర్ల యూనియన్ ఎన్నికలు ఇటీవల జరిగాయి. ఇప్పటికే ఉన్న కార్యవర్గ బాధ్యులు ఓడిపోగా, కొత్తవారు గెలిచారు. లావాదేవీలపై చర్చించేందుకు నూతన కార్యవర్గం బాధ్యులు మంగళవారం ఖమ్మం నెహ్రూనగర్‌లో పాత యూనియన్ బాధ్యుల వద్దకు వెళ్లగా ఆగ్రహంతో ఉన్న వారు లెక్కలు వివరించే క్రమాన గొడవకు దిగారు. ఆపై అంబులెన్స్ డ్రైవర్ వినయ్ ఆధ్వర్యాన ఏలూరి శ్రీకాంత్, మైదులు, మహేశ్ తదితరులపై దాడి చేయగా శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించడంతో న్యాయమూర్తి శ్రీకాంత్ వాంగ్మూలం తీసుకున్నారు. కాగా, దాడికి పాల్పడిన వినయ్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుపై మహిళలకు అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలతో పరిశ్రమలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జెడ్పీ కార్యాలయంలో డీఆర్‌డీఏ, సెర్ప్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో అడిషనల్ డీఆర్డీఓ ఆర్.జయశ్రీ మాట్లాడారు. మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు సదస్సుల్లో ఔత్సాహికులను ఎంపిక చేసి పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ, మెళకువలు, నైపుణ్యాభివృద్ధిపై 15 రోజుల శిక్షణ ఇస్తామని, అంతేకాక లైసెన్స్, రుణాల మంజూరులో అండగా నిలుస్తామని తెలిపారు. సమావేశంలో డీపీఎం దుర్గయ్య, జిల్లా సమాఖ్య కార్యదర్శి కేవీ విజయలక్ష్మి, కోశాధికారి వి.మరియమ్మ, సభ్యులు అలీఫ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

బోనకల్: బోనకల్ రైల్వేస్టేషన్ సమీపాన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతో మృతి చెందాడు. ఒడిశాకు చెందిన బిశ్వనాథ్ మహంతి (38) విజయవాడ వైపు వెళ్తున్న రైలులో బుధవారం ప్రయాణిస్తున్నాడు. ఆయన ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,125	1,800
పెసలు	7,500	4,000
కందులు	6,400	5,100
మినుములు	6,000	6,000
మిర్చి	12,700	5,000
ఏసీ మిర్చి	14,000	7,200
పత్తి	7,200	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,748

డయేరియా నిర్మూలనే లక్ష్యం

- ఈ నెల 31 వరకు కొనసాగనున్న పక్షోత్సవాలు
- జిల్లాలో 1.18 లక్షల మందికి ఓఆర్ఎస్, జింక్ మాత్రల పంపిణీ
- ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్ల సమన్వయంతో కార్యక్రమం



చిన్నారికి మాత్ర అందిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి, డీఐఓ చంద్రూనాయక్ (ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన డయేరియా నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇంటెన్సిఫైడ్ డయేరియల్ కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్)లో భాగంగా 15 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ నెల 16న కార్యక్రమం మొదలుకాగా 31వ తేదీ వరకు 0–5 ఏళ్లలోపు చిన్నారుల్లో నీళ్ల విరేచనాలను నియంత్రించేందుకు వైద్య ఆరోగ్య కృషి చేయనుంది. అందులో భాగంగా చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను జిల్లాలోని సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు పంపిణీ చేస్తారు. గ్రామస్థాయిలో ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్ల సమన్వయంతో ప్రతీ చిన్నారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు మింగించాల్సి ఉంటుంది. వర్షాకాలం రావటంతో కొత్తనీరు ప్రభావంతో ఎక్కువ శాతం చిన్నారులు ఈ సీజన్‌లో డయేరియా (నీళ్ల విరోచనాలు) బారిన పడతారు. శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ విరేచనాల రూపంలో బయటకు పోవడతో చిన్నారులు పూర్తిగా నీరసిస్తారు. శరీర ఉష్ణోగ్రత పెరిగితే వారు మరింత నీరసించే అవకాశం ఉంటుంది. దీంతో ఓఆర్ఎస్ ద్రావణం తాగిస్తే వారికి ఉపశమనం కలుగుతుంది. శరీరం నుంచి విరేచనాల రూపంలో వెళ్లిన ఎలక్ట్రోలైట్స్‌ను ఓఆర్ఎస్ ద్రావణం తాగటం ద్వారా తిరిగి సమకూర్చుకునే అవకాశం ఉంటుంది.

1,18,849 మంది చిన్నారుల గుర్తింపు

జిల్లాలో 0–5 ఏళ్ల లోపు 1,18,849 మంది చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలను ఇవ్వనున్నారు. ఇందుకోసం 385 మంది ఏఎన్ఎంలు, 1,340 మంది ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకుంటారు. స్థానిక అంగన్‌వాడీల సహకారంతో ప్రతీ ఇంటికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్ మాత్రలతో కలిగే లాభాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. ఓఆర్ఎస్ ద్రావణంతో పాటే చిన్నారులకు జింక్ మాత్ర ఇస్తారు.

జింక్‌తో లాభాలు

తరచూ జబ్బు పడకుండా కాపాడుతుంది. త్వరగా నయమయ్యేలా సహకరిస్తుంది. నీళ్ల విరేచనాల సంఖ్య తగ్గుతుంది. అయినా 14 రోజుల వరకు వీటిని ఇవ్వడం ద్వారా కొన్ని నెలల వరకు మళ్లీ విరేచనాలు, న్యూమోనియా రాకుండా కాపాడుతుంది. అలాగే, శరీరంలో జింక్ అవసరాన్ని తీర్చి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కాగా, వయస్సుల వారీగా పిల్లలకు ఈ మాత్రలను తల్లి పాలతో కానీ పరిశుభ్రమైన నీటితో కానీ ఇవ్వొచ్చు. కాగా, విరేచనాలు ప్రారంభమైన వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్ర ఇవ్వాల్సి ఉంటుంది. చిన్నారులకు ఆరు నెలలు విరేచనాలు పెడుతున్నా కూడా తల్లి పాలే తాగించాలి.

ఒక్కరు కూడా మృతి చెందొద్దని..

డయేరియా బారిన పడి 0–5 ఏళ్లలోపు పిల్లలెవరూ మృతి చెందొద్దనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1,17,810 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 1,05,535 జింక్ మాత్రలు సిద్ధం చేశారు. ఇవేకాక సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచీ అవసరమైన చోటకు సరఫరా చేయనున్నారు. ఇటుక బట్టీలు, సంచార జాతులు నివసించే ప్రాంతాల్లో చిన్నారులను గుర్తించి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందించేందుకు వాహనాల ద్వారా వెళ్లనున్నారు.

చిన్నారులందరికీ ఓఆర్ఎస్, జింక్ మాత్రలు



జిల్లాలో గుర్తించిన 0–5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందిస్తాం. పదిహేను రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం విజయవంతమయ్యే లా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఏ ఒక్కరూ డయే రియాతో మృతి చెందొద్దనే లక్ష్యంతో కృషిచేస్తున్నాం. తల్లిందడ్రులు మా సిబ్బందికి సహకరించి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు పిల్లలకు ఇప్పించాలి.

–డాక్టర్ చంద్రూనాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

బిందు సేద్యానికి ప్రోత్సాహం

- ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు చేయూత
- జిల్లాలో 14,500 ఎకరాలకు డ్రిప్ యూనిట్ల మంజూరు
- వార్షిక ప్రణాళికలో రూ.408 కోట్లు కేటాయింపు



ఓ రైతు పొలంలో అమర్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు

కల్లూరురూరల్: ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. అందులో భాగంగా బిందు సేద్యానికి సహకరించేలా సబ్సిడీలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాకు 2025–26 సంవత్సరానికి సంబంధించి రూ.408 కోట్ల నిధులు కేటాయించింది. ఉద్యానవన పంటలైన ఆయిల్‌పామ్, మామిడి, నిమ్మ, జామ, మిర్చి, పత్తి, అరటి, అంజీర, బొప్పాయి, అవకాడో, హైబ్రిడ్ కూరగాయలు, పూలమొక్కలు తదితర పంటలను అధిక శాతం సాగు చేసేలా రైతులను ఉద్యానవన శాఖ ప్రోత్సహిస్తోంది. ఉద్యాన సాగును ప్రోత్సహించడమే కాక తక్కువ ఖర్చుతో లాభాలు గడించేలా డ్రిప్ యూనిట్లు మంజూరు చేయనున్నారు.

రాయితీపై పరికరాలు

బిందుసేద్యం యూనిట్ల మంజూరులో భాగంగా రైతులకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. షెడ్యూల్ కులాలు, తెగల రైతులకు 100 శాతం సబ్సిడీపై పరికరాలు మంజూరు చేస్తారు. అలాగే, సన్న, చిన్నకారు, వెనుకబడిన తరగతుల రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ అందుతుంది. డ్రిప్ సేద్యానికి సంబంధించిన పరికరాలు, సామగ్రి కావాల్సిన రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటికే కొందరు రైతులకు ఈ పథకం ద్వారా యూనిట్లు మంజూరు చేశారు.

తొలి విడతగా రూ.16.17 కోట్లు

జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పరికరాల కొనుగోలుకు తొలి దశలో రూ.16.17 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో మొదటి విడతగా 1,710 ఎకరాల్లో బిందు సేద్యం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక చేశాక, అధికారులు డ్రిప్ మిషనరీ, పరికరాల కొనుగోలుకు నిధులు కేటాయిస్తారు. నిధుల మంజూరు మొదలు పరికరాల ఎంపిక, బిగించే వరకు అధికారులు పర్యవేక్షించనున్నారు. అంతేకాక పరికరాల సరఫరాకు జిల్లాల వారీగా కంపెనీలను సైతం ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యాన వారే కొన్నేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూస్తూ రైతులకు అండగా నిలుస్తారు.

'రాష్ట్రీయ కృషి యోజన'ద్వారా..



రాష్ట్రీయ కృషి యోజన పథకం కింద రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోంది. పండ్ల తోటలకు డ్రిప్‌తో పాటు కూరగాయల తోటల్లో పందిళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం. అలాగే, రైతులు వెదురు సాగు చేపట్టవచ్చు.

–జి.నగేశ్, ఉద్యానవనశాఖ అధికారి, కల్లూరు డివిజన్

తక్కువ ఖర్చుతో సాగు



ప్రభుత్వం బిందు సేద్యం పరికరాలను రాయితీపై ఇవ్వనుండడంతో కూరగాయల సాగు చేపడుతున్నా. తక్కువ నీటితో పంటల సాగుకు ఈ పథకం దోహదపడుతుంది. వ్యయం తగ్గడమే కాక ఆదాయం పెరగనుండడంతో లాభం ఉంటుంది.

–నడికొప్పు నర్సింహారావు, రైతు, ముగ్గు వెంకటాపురం

ఐదెకరాల్లో ఆయిల్‌పామ్



ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్ పరికరాలు మంజూరయ్యాయి. ఐదెకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో యూనిట్ పెట్టుకున్నాం. బిందు సేద్యం విధానంలో అన్ని మొక్కలకు సమపాళ్లలో త్వరగా నీరు అందించడం సాధ్యమవుతోంది.

–కొండపల్లి శ్రీమన్నారాయణ, రైతు, వెన్నవల్లి

మానవత్వంతో ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లిలో గత నెల గ్యాస్ సిలిండర్ పేలగా ఒకే కుటుంబానికి చెందిన కవల పిల్లలు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో బాలుర తండ్రి గుత్తికొండ వినోద్ కూడా గాయపడగా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. మండల విద్యాశాఖ ఆధ్వర్యాన సేకరించిన రూ.50 వేల నగదును బుధవారం ఎంఈఓ ఎస్.దామోదర ప్రసాద్ చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. తొలుత విరాళాల రూపంలో సమకూరిన రూ.61 వేల నగదును వినోద్‌కు అందించారు. కానీ, ఆయన మొత్తం నగదు తీసుకోకుండా తన కుమారులు చదివిన మిట్టపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన సామగ్రి కోసం రూ.11 వేలు వెచ్చించాలని కోరాడు. ఈ మేరకు పిల్లలకు ఆ నగదుతో బ్యాగ్‌లు, ప్యాడ్‌లు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాయల నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీ



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీ

ఇల్లెందు: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇల్లెందు, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, మాలోతు రాందాస్‌నాయక్ సీఎంను కలవగా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, నిధుల మంజూరు ప్రతిపాదనలు సమర్పించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచేలా ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సీఎం వారికి సూచించారు.

ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో మెలగాలి



కేడెట్లతో ఎన్‌సీసీ అధికారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో మెలగుతూ ఉన్నత స్థానాలకు చేరాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ నార్సింగ్ షైలానీ సూచించారు. ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లోని ఎన్‌సీసీయూనిట్‌ను బుధవారం పరిశీలించిన ఆయన కేడెట్లతో మాట్లాడారు. కేడెట్లు ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. భారత ఆర్మీలో చేపట్టే ఎంపికల్లో ఎన్‌సీసీ కేడెట్లకు ప్రత్యేక కోటాఉంటుందని చెప్పారు. అనంతరం గ్రూప్ కమాండర్‌కల్నల్, వీరచక్ర అవార్డు గ్రహీత సచిన్ నింబాల్కర్, ఏడీ (పర్సనల్) కల్నల్ సంజీవ్‌కుమార్,11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్‌కుమార్ భద్ర, హార్వెస్ట్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డితో పాటు జి.బాలకృష్ణ, మమత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మంలోని 11వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్‌ను నర్సింగ్ షైలానీ తదితరులు సందర్శించి వివరాలు ఆరాతీశారు.

సాగర్ కెనాళ్ల మరమ్మతులు చేపట్టాలి



ధర్నాలో రైతు సంఘం నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: వానాకాలం పంటల సాగు సీజన్ మొదలైనందున సాగర్ ఆయకట్టు వరకు నీరు అందేలా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించగా, సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. ఐదు దశాబ్దాల కిందట సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం చేపట్టారని, ఆ తర్వాత కాల్వల్లో అవాంతరాలు, చెట్లు పెరగడంతో ఆయకట్టు చివరి భూములకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా మరమ్మతులు చేయడంతో పాటు అర్హులందరికీ రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేశ్, నాయకులు చింతనిప్పు చలపతిరావు, గుడ్డూరి ఉమ, తూళ్లూరు రమేశ్, ఉపేందర్, రామారావు, భాస్కర్‌రావు, రామకృష్ణ, వీరభద్రం, మధు, వెంకట్రావు, అప్పారావు, శ్రీను, ఆనందరావు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాతో పాటే పిల్లలు!



విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న సుధాకర్

కల్లూరురూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు బడిబాట నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కల్లూరు మండలం చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ తన బైక్‌పై గ్రామంలో పర్యటిస్తూ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో వసతులను తల్లిదండ్రులకు వివరిస్తున్నాడు. ఆపై వారు ఒప్పుకుంటే పిల్లలను అప్పటికప్పుడే తన బైక్‌పై స్కూల్‌కు తీసుకెళ్లి అడ్మిషన్లు ఇప్పిస్తుండగా పలువురు అభినందిస్తున్నారు.

రూ.3.60 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయితో ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్ రోడ్డు సమీపాన గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకర రమేశ్ నేతృత్వంలో మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టగా టీఎన్జీవోస్ కాలనీకి చెందిన కట్టగోరు రవితేజ, పాకబండబజార్‌కు చెందిన జిలాన్ సైఫ్, సంభానీనగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ బాషా, పిండిప్రోలుకు చెందిన బాసిగోంపు గోపి, కోలా శ్రీకాంత్ పట్టుబడ్డారు. ఇదే ముఠాకు సంబంధించి ఎలగందుల సందీప్ పరారీలో ఉండగా, వీరంతా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి బైక్‌లపై వెళ్లి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో నిందితుల నుంచి రూ.3.60 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ రమేశ్‌తోపాటు ఎస్ఐ శ్రీహరిరావు, ఉద్యోగులు కరీం, బాలు, సుధీర్, వెంకటేశ్, విజయ్, హనుమంతరావు, హరీశ్, వీరబాబు పాల్గొన్నారు.

12 ట్రాలీలు.. 39 పశువులు

అక్రమంగా తరలిస్తున్నారని స్వాధీనం



పశువుల వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మంఅర్బన్: కామేపల్లి మండలం పండితాపురం సంతలో కొనుగోలు చేసి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, ఇతర జిల్లాలకు తరలిస్తున్న పశువులను ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పలువురు రైతులు 12 మినీ ట్రాలీల్లో 39కిపైగా పశువులను తీసుకెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. వ్యవసాయ అవసరాల కోసం ఈ పశువులను కొనుగోలు చేసినట్లు చెప్పడమే కాక అన్ని పత్రాలు చూపించారు. అయినప్పటికీ ఒక్కో వాహనంలో రెండుకు మించి పశువులను తీసుకెళ్లొద్దనే నిబంధన ఉల్లంఘించారని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఆపై పశువులను సమీప గోశాలలకు తరలించి వాహనదారులు, కొనుగోలుదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసుల వివరణ కోసం యత్నించగా స్పందించలేదు. కాగా, వ్యవసాయ పనుల కోసం ఆవులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతులను పోలీసులు వేధించడం గర్హనీయమని మాస్‌లైన్ జిల్లా నాయకుడు ఆవుల అశోక్ పేర్కొన్నారు. ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన రైతులను కలిసి మాట్లాడారు. కొందరు ఆకతాయిలు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే విచారణ లేకుండా పోలీసులు వాహనాలను సీజ్ చేయడం సరికాదని తెలిపారు.

అటు ఉద్యోగం.. ఇటు అంత్యక్రియలు

శుభవార్త వినకుండానే కన్నుమూసిన యువకుడు



మణిచందన్ (ఫైల్)

రఘునాథపాలెం: ఉద్యోగానికి ఎంపికై నట్లు సమాచారం తెలియకుండానే యువకుడు కన్నుమూయడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. రఘునాథపాలెం మండలం వీవీ పాలెంనకు చెందిన బానోత్ మణిచందన్ (21) తన తండ్రి బాలాజీతో కలిసి సూర్యాపేట జిల్లా బురకచర్ల వెళ్లి వస్తూ కూసుమంచి వద్ద జరిగిన ప్రమాదంలో మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. అయితే, పోలీసు, సైనిక దళాల్లో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో శ్రమించిన మణిచందన్ ఇటీవల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్ల భర్తీకి నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. తాజాగా విడుదలైన జాబితాలో ఆయన పేరు ఉన్నట్లు మంగళవారం ప్రకటించారు. కానీ, అప్పటికే మణిచందన్ మృతి చెందగా.. ఈ విషయం బుధవారం ఉదయం కుటుంబీకులకు తెలిసింది. విజయం సాధించినట్లు తెలుసుకోకుండానే మణిచందన్ మృతి చెందడం ఆయన కుటుంబంలో విషాదాన్ని నింపగా, బంధువులు, గ్రామస్తులు సైతం కన్నీరుమున్నీరయ్యారు.

జీసీసీ గోదాంలో రేషన్ బియ్యం తనిఖీ

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సముదాయంలోని గోదాంలో రేషన్ బియ్యం నిల్వలను రాష్ట్ర విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అంజయ్య నేతృత్వంలోని బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. గోదాంలోని సన్నబియ్యం రేషన్ షాపులకు ఎన్ని క్వింటాళ్లు తరలించారు.. ఎంత నిల్వ ఉన్నాయి.. అనే వివరాలతో పాటు ఆర్ఓ ఎంట్రీలను పరిశీలించారు. దమ్మపేట, భద్రాచలంలో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు డీటీ శ్రీనివాసరావు తెలిపారు.

చెక్ డ్యాంలో పడి వ్యక్తి మృతి



చిన్న వెంకయ్య (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం వైకుంఠధామం సమీపంలోని చెక్ డ్యాంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెంగల చిన్న వెంకయ్య(55) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. బుధవారం చెక్ డ్యాం నీటిలో మృతదేహం లభ్యమైంది. అనారోగ్యం, మానసిక స్థితి బాగాలేక బాధపడుతున్న చిన్న వెంకయ్య బహిర్భూమికి వెళ్లి చెక్ డ్యాంలో పడి మృతి చెంది ఉండవచ్చునని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.